సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 24 । జూన్ । 2024



నూకాంబికకు ప్రత్యేక పూజలు

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవర పాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయం లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 8లో



ఘనంగా ఆర్జిత సేవలు

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి 8లో



తీరం.. జనసంద్రం

విశాఖ నగరంలోని సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి.

న్యూస్‌రీల్

ఎంపీ తనూజారాణి ప్రమాణ స్వీకారం నేడు



సాక్షి,పాడేరు: అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి సోమవారం ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈమేరకు ఆమె ఆదివారం ఢిల్లీ చేరుకున్నారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అరకు ఎంపీగా పోటీ చేసిన తనను అరకు పార్లమెంట్ పరిధిలో ఓటర్లు భారీ మెజారిటీతో గెలిపించారన్నారు.అరకు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పార్టీ నాయకులు,కార్యకర్తలు,అన్ని వర్గాల ఓటర్లకు రుణపడి ఉంటానని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఆయన బాటలో నిస్వార్థమైన ప్రజాసేవ చేస్తానని ఆమె పేర్కొన్నారు.

ఇంటి పండగలతో సందడి



మట్టి ఘటాలతో భక్తులు

సాక్షి,పాడేరు: పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడితో పాటు పాడేరు పట్టణంలోని మోదకొండమ్మతల్లి ఆలయంలో అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు భారీగానే తరలివచ్చారు. మైదాన ప్రాంతాలతో పాటు స్థానిక భక్తులంతా మోదమ్మకు ఇంటి పండగలను ఘనంగా జరుపుకున్నారు.మోదమ్మకు అత్యంత ప్రీతిపాత్రమైన మట్టి ఘటాలను భక్తిశ్రద్ధలతో మోసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.మొక్కులు తీర్చుకున్నారు. ఘటాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయాల వద్దే మధ్యాహ్నం వంటలు చేసుకుని కుటుంబాలు, బంధుమిత్రులతో సందడి వాతావరణం నెలకొంది.

త్రిశక్తి వైభవంపై ముగిసిన ప్రవచనాలు



ప్రవచిస్తున్న శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని

సీతంపేట: శ్రీలలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాలలో భాగంగా శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని త్రిశక్తి వైభవంపై రెండు రోజులుగా చేస్తున్న ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు లలితాదేవి రూపాలలో వాగ్దేవి, వాగీశ్వరి రూపం, సరస్వతి దేవి, వాక్కు శక్తి, అమ్మవార్ల ఆరాధన విశిష్టతను వివరించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితాపీఠం ద్వితీయ పీఠాధిపతులు అవ్యక్తానంద మహరాజ్ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు అభిషేకం, అర్చన జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు సిద్ధేశ్వరానంద భారతీ స్వామిచే జగద్గురు శంకర విజయంపై అనుగ్రహ భాషణం ఉంటుందని తెలిపారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ పోటీలు



హ్యాండ్ బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎంవీపీకాలనీ (విశాఖ): ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని ఏబీసీ పార్క్‌లో ఆదివారం హ్యాండ్ బాల్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ప్రపంచ ఒలింపిక్ డే, ప్రపంచ హ్యాండ్ బాల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించారు. హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రాజారావు మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎంతో ఆదరణ పొందిన క్రీడల్లో హ్యాండ్‌బాల్ ఒకటన్నారు. ఈ క్రీడల్లో విశాఖ నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడంతో పాటు ఉన్నత ఉద్యోగ అవకాశాలు సైతం పొందారన్నారు. వారి స్ఫూర్తితో నేటి యువత హ్యాండ్ బాల్‌లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పూసపాటి సత్యనారాయణరాజు, వి.గురుమూర్తి పాల్గొన్నారు.

కొండా కోనల్లో ఆకాశ'వాణి' వినిపించనుంది. శ్రోతలకు వీనుల విందు చేయనుంది. చింతపల్లి కేంద్రంగా రిలే స్టేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌మీటర్ టవర్ ఏర్పాటుకు రూ.12.5 కోట్ల కేటాయించింది. నిర్మాణ పనులు ఏడాదిన్నరలోగా పూర్తి చేసే లక్ష్యంతో సాంకేతిక విభాగం కసరత్తు వేగవంతం చేసింది.

కొండా కోనల్లో ఆకాశవాణి



- చింతపల్లి కేంద్రంగా రిలే స్టేషన్
- కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- నిర్మాణానికి 50 సెంట్ల స్థలం
- రూ.12.5 కోట్ల నిధులు కేటాయింపు
- 75 మీటర్ల ఎత్తున ప్రత్యక్ష రిలే కేంద్ర ట్రాన్స్‌మీటర్ టవర్
- ఏడాదిన్నరలోగా పూర్తి చేసేలా కసరత్తు
- 'విశాఖ' కార్యక్రమాలు విస్తరణ

చింతపల్లి రూరల్: విశాఖ కేంద్రంగా ఆకాశవాణి తరంగాలు ఇకపై మన్యాన్ని తాకనున్నాయి. ఆరు దశాబ్దాల తరువాత రేడియో ప్రసారాలు ఏజెన్సీ ప్రాంత ప్రజలను అలరించనున్నాయి.

నాటి కాలంలో..

పాతకాలంలో రేడియో లేనిదే ఏ సమాచారం తెలిసేది కాదు. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా భిన్నం. వివిధ టీవీ చానళ్లు అందుబాటులోకి రావడంతో ప్రజలు వినోదం పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో తన వాణి వినిపించేందుకు ఆల్ ఇండియా ఎఫ్ఎం రేడియో ఆకాశవాణి సిద్ధమైంది.

రిలే కేంద్రం లేక..


ఏజెన్సీలో రిలేకేంద్రం లేనందున విశాఖ కేంద్రం నుంచి రేడియో ప్రసారాలు దట్టమైన అటవీ ప్రాంతం కావడం వల్ల సక్రమంగా అందేవికావు. ప్రసార భారతి పరిధిలో ఉన్న ఈ సంస్థ 1936లో ఏర్పాటైంది. విశాఖ కేంద్రంగా 4 ఆగస్టు, 1963లో ప్రసారాలు ప్రారంభమయ్యాయి. అప్పటిలో ఫ్రీక్వెన్సీ తక్కువ కావడంతో ఏజెన్సీ ప్రాంతానికి తరంగాలు అందుబాటులో ఉండేవి కావు. ఇక్కడ ఉన్న 10 కిలోవాట్ ప్రత్యక్ష రిలే కేంద్ర ట్రాన్స్‌మీటర్ ద్వారా ప్రసార తరంగాలు 60 నుంచి 70 కిలోమీటర్ల వరకు మాత్రమే అందేవి. ఈ కారణంతోపాటు దట్టమైన అటవీప్రాంతం మధ్య ఏజెన్సీ ఉన్నందున ఆకాశవాణి కార్యక్రమాలకు ఈ ప్రాంత ప్రజలు దూరమయ్యారు.

సేవలు విస్తరణకు..

ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఆకాశవాణి సేవలను విస్తరణకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చింతపల్లి కేంద్రంగా 75 మీటర్ల ఎత్తుతో ప్రత్యక్ష రిలే కేంద్ర ట్రాన్స్‌మీటర్ టవర్ నిర్మాణానికి రూ.12.5 కోట్లు కేటాయించింది. ఈ టవర్‌కు ఐదు కిలోవాట్ ఫ్రీక్వెన్సీ సామర్థ్యం ఉన్నందున ఈ రిలే స్టేషన్ నుంచి సుమారు 40 కిలోమీటర్ల పరిధిలో ప్రసార తరంగాలు వ్యాపించనున్నాయి. జిల్లాలో పాడేరు డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలందరికీ ఆకాశవాణి కార్యక్రమాలు అలరించనున్నాయి.

స్థల కేటాయింపు

చింతపల్లిలో ఆకాశవాణి రిలే స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన పూర్తయింది. ఎత్తయిన ప్రాంతమైన వైటీసీ కొండపై 50 సెంట్ల స్థలాన్ని రెవెన్యూశాఖ గుర్తించింది. ఈ కేంద్రం నిర్మాణ పనులు ఒకటి రెండు నెలల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని సంబంధిత అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ కొండపై 75 మీటర్ల ఎత్తులో రిలే టవర్ ఏర్పాటుచేస్తారు.



చింతపల్లిలో నిర్మించనున్న ఆలిండియా రేడియో రిలే స్టేషన్ టవర్ ఇదే

త్వరితగతిన పూర్తిచేస్తాం



చింతపల్లిలో ఏర్పాటుకానున్న రిలే స్టేషన్ నిర్మాణ పనులను ఏడాదిన్నరలోగా పూర్తిచేయాలన్న లక్ష్యంతో ఉన్నాం. విశాఖపట్నంలో ఆకాశవాణి ప్రసార కేంద్రం ఉన్నప్పటికీ ఫ్రీక్వెన్సీ తక్కువ కావడంతో ఏజెన్సీ గిరిజన గ్రామాలకు ప్రసారాలు అందుబాటులో లేవు. ఇప్పుడు ఏర్పాటుచేస్తున్న రిలే స్టేషన్ పనులు పూర్తయితే ఏజెన్సీ అంతటా ఆకాశవాణి ప్రసారాలు అందుబాటులోకి వస్తాయి.

– సి.సుబ్బారావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ (ఇంజనీరింగ్ వింగ్), ఆకాశవాణి, విశాఖపట్నం

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?

- కూలిన రక్షణ గోడను పునరుద్ధరించని అధికారులు
- భయంభయంగా రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు



ప్రమాదకర మలుపువద్ద రక్షణగోడలేని ప్రాంతంలో రాళ్లను ఏర్పాటుచేస్తున్న బ్రో సభ్యులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు మార్గంమధ్యలోని రైల్వే గేటు సమీప మలుపు వద్ద రక్షణగోడ కూలిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో మలుపు వద్ద అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా నివారణకు ఆర్అండ్‌బీ, రైల్వే అధికార యంత్రాంగం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వారు ధ్వజమెత్తుతున్నారు. రెండేళ్ల క్రితం ఇదే మలుపు వద్ద లారీ 80 అడుగుల లోయలోకి దూసుకుపోయింది. లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గత ఆదివారం సాయింత్రం కేబుల్‌లోడ్‌తో బొర్రా వెళ్తున్న వ్యాన్ ఇదే మలుపువద్ద బ్రేక్‌ఫెయిల్ కావడంతో 80 అడుగుల లోయలోకి దూసుకుపోయింది. డ్రైవర్ ప్రాణాలు కోల్పోయాడు. ఇలా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై బ్రో సభ్యులు స్పందించారు. ప్రమాదకర ప్రదేశం వద్ద వాహనచోదకులు గుర్తించేలా రాళ్లను ఏర్పాటుచేసి సున్నం వేశారు. కర్రలకు తాడు కట్టి, ప్రమాదాలకు నివారణకు తమవంతు కృషి చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

నక్కలపుట్టులో మోదమ్మ ఉత్సవాలు ప్రారంభం



నక్కలపుట్టులో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ, ప్రజాప్రతినిధులు

పాడేరు : మండలంలోని కిండంగి పంచాయతీ నక్కలపుట్టులో ఆదివారం మోదకొండమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నక్కలపుట్టు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సతకంపట్టు వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహం, అమ్మవారి పాదాలు, ఘటాలను ఎంపీపీ సొనారి రత్నకుమారి, స్థానిక సర్పంచ్ దుంబేరి శ్రీలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, మాజీ ఎంపీపీ ఎస్వీ రమణమూర్తి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొత్తల త్రినాథ్, తదితరులు ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రతిష్ఠించారు. ఊరేగింపులో డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాలు, గరగల డాన్సులు, థింసా నృత్యాలు, తీన్‌మార్ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపు సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. సతకం పట్టు వద్ద కొలువుదీరిన అమ్మవారిని వందలాది సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలు మంగళవారం వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొత్తల త్రినాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పొనగంటి అప్పారావు, మునగపాక నాగరాజు, కొత్తల అప్పారావు, సీసాలి భూపాల్, బుక్కా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పాపికొండలు నేషనల్ పార్క్ ఉన్నతాధికారి సందర్శన



జంగిల్ స్టార్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి

మారేడుమిల్లి: పాపికొండలు నేషనల్ పార్క్ ప్రాంతంలోని పిండుకూరివలస ప్రాంతాన్ని ఆదివారం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి సందర్శించారు. డబ్ల్యూఎల్ఎం రంపచోడవరం రేంజ్‌లో చేపట్టిన రాక్‌ఫిల్ డ్యాంలు, పెర్కొలేషన్ ట్యాంకులు, సాసర్ ఫిట్స్ వంటి ఎస్ఎంసీ పనులను పరిశీలించారు. అనంతరం అటవీ శాఖలో పనిచేస్తున్న గిరిజన యువకులతో మాట్లాడి బేస్ క్యాంప్ సహాయకులకు సోలార్ లైట్లు, దోమతెరలు, బూట్లు, వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పిండుకూరివలస నుంచి కొండమొదలు గ్రామం వరకు ట్రెక్కింగ్ చేసి సహజ అటవీ ప్రాంతంలో వేగిస వంటి చెట్లతోపాటు కొన్ని స్థానిక జాతులను గుర్తించారు. ప్రత్యక్ష లేదా పరోక్ష సాక్ష్యాలు అంటే పగ్‌మార్క్స్, స్కాట్ మొదలైన వన్యప్రాణులు పర్యవేక్షణపై స్థానిక గిరిజనులతో మాట్లాడారు. ట్రాప్ కెమెరాకు చిక్కిన లెపోర్ట్, ఇండియన్ గౌర్, సాంబార్, బార్కింగ్ డీర్ వంటి చిత్రాలను పరిశీలించారు. సీబీఈటీ, వనవిహారి, జంగిల్ స్టార్‌లను సందర్శించారు. సీబీఈటీ సిబ్బందితో మాట్లాడారు. జంగిల్ స్టార్‌లో జరుగుతున్న పనులు పరిశీలించారు. సావనీర్ షాప్, స్థానిక జాతులను ప్రోత్సహించడం ద్వారా పచ్చదనాన్ని మెరుగుపరచడం వంటివి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీఎఫ్ రాజమహేంద్రవరం శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌వో నరేంధిరన్, స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తులరెడ్డి పాల్గొన్నారు.

నాటి సేవాతత్పరుడే నేడు కలెక్టర్

- దినేష్‌కుమార్‌ను నియమించిన ప్రభుత్వం
- గతంలో రంపచోడవరం ఐటీడీఏ పీవోగా ప్రజలకు విశేష సేవలు
- వైద్య సేవలు, సమాచార వ్యవస్థ మెరుగుకు కృషి
- పాలనలో తనదైన ముద్ర
- గత సంస్కరణలు జ్ఞప్తికి తెచ్చుకుంటున్న ఈ ప్రాంతీయులు



రంపచోడవరం ఐటీడీఏ పీవోగా బైక్‌పై గొబ్బిలమడుగు వెళ్తున్న దినేష్‌కుమార్ (ఫైల్)

రాజవొమ్మంగి: జిల్లా కలెక్టర్‌గా నియమితులైన దినేష్‌కుమార్ రంపచోడవరం ఐటీడీఏ పీవోగా 2016-17 పనిచేశారు. ఆయన అప్పట్లో విశేష సేవలందించారు. అదే సంవత్సరం జూలైలో పారా మెడికల్ సిబ్బంది పోస్టులు భర్తీ చేసి గిరిజనులకు వైద్య సేవలను మరింత చేరువ చేశారు. పారిశుధ్యంపై కూడా ప్రధానంగా దృష్టి సారించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలపై ప్రజల్లో నమ్మకం కలిగించేలా ఎన్నో సంస్కరణలు చేపట్టారు. కార్పొరేట్ స్థాయి వైద్యం పొందే అవకాశం ఉన్నా భార్య విజయ కృష్ణన్ (అప్పట్లో సబ్ కలెక్టర్/ రాజమహేంద్రవరం) మొదటి కాన్పు రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చేయించారు. సమాచార వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా వి-శాట్, హోం రేడియో సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఆయన కృషి చేశారు. నగదు రహిత లావాదేవీలపై గిరిజనుల్లో చైతన్యం తెచ్చే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయం అనుబంధ రంగాల సమన్వయంతో ప్రతీ మండలంలో అదనపు నీటి లభ్యతతో సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించి వాటి ప్రయోజనాలను చేరువ చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలపై కూడా ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. అప్పట్లో మారేడుమిల్లి మండలంలోని లోతట్టు గ్రామం ఇజ్జలూరుకు అప్పటి తూర్పు గోదావరి కలెక్టర్ కార్తికేయ మిశ్రాతో 22 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లో మండల కేంద్రాలకు సుమారు 30 కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు రహదారి సదుపాయాల కల్పనకు విశేష కృషి చేశారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఆయన జిల్లా కలెక్టర్‌గా నియమితులవడంతో సాగునీటి వనరుల అభివృద్ధికి కృషి జరుగుతుందని ఈ ప్రాంత రైతులు ఎదురు చూస్తున్నారు. మండలంలోని రైతుల చిరకాలంగా ఎదురుచూస్తున్న కిర్రాబు వద్ద జలాశయ నిర్మాణం కార్యరూపం దాల్చుతుందని ఆశిస్తున్నారు.

ఉరుములతో వర్షం



కూలిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు

రాజవొమ్మంగి: మండలంలో ఆదివారం ఉరుములు మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు 8.0 ఎంఎం వర్షపాతం నమోదు అయినట్లు ఏఎస్‌వో చైతన్య తెలిపారు. వరి నారుమళ్లు వేసుకునేందుకు ఉపయోగపడుతుందని గిరి రైతులు తెలిపారు. ఇప్పటికే గత ప్రభుత్వం 90 శాతం రాయితీపై వరి విత్తనాలు అందజేసింది. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. ఈదురు గాలులకు మండలంలోని ఉర్లాకుల పాడు– వైకుంఠపురం గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనచోదకులు జడ్డంగి అన్నవరం, ఎల్లవరం, గొందోలు మీదుగా రాజవొమ్మంగి చేరుకున్నారు. జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు సంఘటనాస్థలానికి వెళ్లి చెట్టు తొలగింపు చర్యలు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు.

స్వేదం చిందించి.. రోడ్డు నిర్మించి..



రోడ్డు పనుల్లో నిమగ్నమైన బూరుగ, చినకోనెల గిరిజనులు

అనంతగిరి: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని చూడలేదు.. చేయిచేయి కలిపారు.. ముందుకు సాగారు.. కిలోమీటరు పొడవునా మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ బూరుగ, చినకోనెల గ్రామాల గిరిజనులు మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. తమ గ్రామాలకు వెళ్లేందుకు అనుకూలంగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వారంతా స్పందించారు. బూరుగ, చినకోనేల నుంచి విజయనగరం జిల్లా వాణిజ వరకు మట్టిరోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏడు రోజులుగా వందమంది శ్రమిస్తున్నారు. అధికారులు స్పందించి పక్కా రోడ్డుగా అభివృద్ధి చేసి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామ గిరిజనులు పెంటయ్య, ఎర్రయ్య, కొత్తయ్య, అప్పలరాజు తదితరులు కోరారు.

భయం గుప్పిట్లో చుట్టుమెట్ట

చుట్టుమెట్ట.. అరడకోట పంచాయతీలో మారుమూల గ్రామం.. ఇక్కడ సుమారు 300 మంది జీవనం సాగిస్తున్నారు.. మండలకేంద్రానికి పది కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈ గ్రామంలో మొన్నటివరకు ప్రశాంతమైన వాతావరణం. ఉన్నట్టుండి గ్రామంలోని భూతవైద్యుడితో పాటు మరో వ్యక్తి హఠాన్మరణంతో గ్రామ గిరిజనులు ఆందోళనకు గురయ్యారు. మూఢ నమ్మకాల బారిన పడి భయంభయంగా కాలం గడుపుతున్నారు.



నిర్మానుష్యంగా చుట్టుమెట్ట గ్రామం



మూఢ నమ్మకాలపై చుట్టుమెట్ట గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

- భూత వైద్యుడు, మరో వ్యక్తి హఠాన్మరణంతో ఆందోళన
- మూఢ నమ్మకాలతో భయం భయం
- ఇళ్లకే పరిమితం
- స్పందించిన పోలీసులు
- ధైర్యం నింపేలా అవగాహన కార్యక్రమాలు
- నేడు గ్రామానికి వైద్య బృందం

పెదబయలు: మండలంలోని చుట్టుమెట్ట గ్రామంలో కిముడు సహదేవ్ (41) భూత వైద్యం చేస్తుంటాడు. ఇందు నిమిత్తం చుట్టుపక్కల గ్రామాలకు వెళ్తుంటాడు. ఈనేపథ్యంలో ఈనెల 19న అదే గ్రామంలో కాలనీలో నివాసం ఉంటున్న పాంగి అన్యాసమ్మ కొంతమంది మహిళలతో కాఫీ తోటల్లో పనులకు వెళ్లింది. అక్కడ చెట్టు కొమ్మ పడటంతో వచ్చిన శబ్దానికి ఆమె భయపడింది. అక్కడి నుంచి ఇంటికి వచ్చిన తరువాత ఆమె అస్వస్థతకు గురైంది. ఈ విషయం ఆమె భర్త గ్రామంలోని భూత వైద్యుడి సహదేవ్ దృష్టికి తీసుకువెళ్లాడు. వెంటనే అతను మూలికలు, ఇతర సామగ్రితో కిల్లో త్రినాథ్ (28)తో కలిసి అన్యాసమ్మ ఇంటికి వచ్చాడు. భూత వైద్యం చేయడంతో కొద్ది సమయానికి ఆమె కోలుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడే ఉన్న సహదేవ్, త్రినాథ్ కాసేపటికే కళ్లు తిరుగుతూ పడిపోయారు. తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. ఇలా భూత వైద్యుడు, అతనితో వచ్చిన మరో వ్యక్తి మృతి చెందడంతో గ్రామ గిరిజనులు ఆందోళనకు గురయ్యారు. మూఢనమ్మకాల బారిన పడిన వారు భయం గుప్పిట్లో వారు కాలం గడుపుతున్నారు.

రంగంలోకి పోలీసులు

గిరిజనులు భయాందోళనకు గురైన విషయం తెలుసుకున్న ఎస్ఐ మనోజ్‌కుమార్ సిబ్బందిని గ్రామానికి పంపించారు. భూత వైద్యుడు సహదేవ్ వినియోగించిన మూలికలు, ఇతర సామగ్రిని సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వీటిని ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపిస్తామని వారు తెలిపారు.వెంటనే వైద్య సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. మూఢ నమ్మకాల బారిన పడొద్దని అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం నింపుతున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న భూతవైద్యుడు సహదేవ్ వినియోగించిన మూలికల చూర్ణం

నేడు ప్రత్యేక వైద్య శిబిరం

పెదబయలు: మండలంలోని చుట్టుమెట్టలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా తెలిపారు. గ్రామంలో ఇద్దరు మృతితో గిరిజనులు అందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ శిబిరం ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. సైకియాట్రిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్‌తో ఈ శిబిరం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. రక్త పోటు, షుగర్, హెచ్‌బీ, సికెల్ సెల్,మలేరియా, నీటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఇద్దరు మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తామని, గ్రామ గిరిజనులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

ఉన్నతాధికారులకు నివేదిక

చుట్టుమెట్ట గ్రామంలో ప్రస్తుత పరిస్థితిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఈ నెల 18న అదే గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాం. అప్పటి పరిస్థితి అంతా బాగానే ఉంది. మరుసటి రోజులు ఇద్దరు మృతి చెందారని తెలియడంతో గ్రామానికి వైద్యసిబ్బందితో వెళ్లి పరిశీలించాం. మూఢ నమ్మకాల బారిన పడొద్దని గ్రామస్తులు అవగాహన కల్పించాం.

– నిఖిల్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, పెదబయలు

నాటు వైద్యులను ఆశ్రయించొద్దు

నాటు వైద్యులను ఆశ్రయించ వద్దని గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో అవగాహన కల్పిస్తున్నాం. దెయ్యం, భూతం అంటూ మూఢనమ్మకాల బారిన గ్రామస్తులు పడ్డారు. ఎవరికైనా బాగోకపోతే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలి. లేదంటే సమీప ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొందాలి..

– డాక్టర్ జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

జీవోలపై టీడీపీ హామీ నిలబెట్టుకోవాలి

- యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

పాడేరు: తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు జీవో నంబరు 3ను పునరుద్ధరించాలని, ఉపాధ్యాయ పోస్టులను తగ్గించటానికి తీసుకొచ్చిన జీవో నంబరు 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. కిశోర్‌కుమార్ డిమాండ్ చేశారు. పాడేరు యూటీఎఫ్ కార్యాలయంలో ఆఫీస్ గదిని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అరకు ఎన్నికల బహిరంగ సభలో అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నంబరు 3ను పునరుద్ధరిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. దీన్ని పునరుద్ధరణ చేసిన తర్వాతే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై. విల్సన్‌బాబు, ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ఈ ఏడాది చేపట్టాల్సిన కార్యక్రమాలపై భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు చీకటి నాగేశ్వరరావు, నాయకులు పి.దేముడు, కె. రఘునాథ్, సూరిబాబు, రాంబాబు, సనాతన బాబు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికకు ప్రత్యేక పూజలు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంత మంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులు తీరారు. వృద్ధులు, గర్భిణులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆదివారం ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

జీడి అ'ధర'హో...



పందిరిమామిడిలోని జీడిపిక్కల కొనుగోలు కేంద్రం

గతేడాది కంటే జీడి పిక్కల ధర పెరిగినా గిరిజన రైతులకు ప్రయోజనం చేకూరడం లేదు. వాతావరణం అనుకూలించక పంట దిగుబడి తగ్గిపోవడంతో ఇప్పుడు ధరను చూసి ఉసూరుమంటున్నారు. వచ్చిన కొద్దిపాటి పంటను వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

- కేజీ రూ.150కు చేరిన జీడి పిక్కల ధర
- ఏజెన్సీలో ఏటా రూ.100 కోట్ల వ్యాపారం
- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- గిరిజన రైతులకు ఒరిగేది శూన్యమే

రంపచోడవరం: ఏజెన్సీ జీడిమామిడి పంటకు మైదాన ప్రాంతంలో మంచి గిరాకీ ఉంటోంది. పంట దిగుబడి కోసం ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడక పోవడంతో ఇక్కడ దొరికే జీడిపప్పు ఎంతో నాణ్యతగా రుచికరంగా ఉంటోంది. ఈ ఏడాది జీడి పంట దిగుబడి తక్కువగా ఉన్న ధర మాత్రం అదిరిపోయింది. ఎప్పుడు కాపు వస్తుందా అని చూసే గిరిజనులు ఎప్పటికప్పుడు సేకరించిన జీడి పిక్కలు వ్యాపారులకు అమ్ముకున్నారు. అక్కడక్కడా కొంత మంది రైతులు ధర పెరుగుతుందని నిల్వ ఉంచుకుని లబ్ధి పొందగా, వీరి కంటే వ్యాపారులే ఎక్కువగా సొమ్ము చేసుకున్నారు.

సీజన్ ప్రారంభంలో కేజీ రూ.100 నుంచి ...

జిల్లాలో 60 వేల ఎకరాల్లో జీడి పంట సాగవుతోంది. ఈ పంటపైనే గిరిజనులు ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో కేజీ జీడిపిక్కలు రూ. 100 పలకగా, క్రమంగా ధర పెరుగుతూ వచ్చింది. గతేడాది ఇదే సమయంలో కేజీ రూ.120 ఉండగా, ప్రస్తుతం మార్కెట్లో కేజీ రూ.150 నుంచి రూ.160 వరకు ఉంది. రంపచోడవరం సమీపంలోని పందిరిమామిడి సెంటర్‌లో వ్యాపారులు జీడి పిక్కలు కొనుగోలు చేస్తారు. ఇక్కడ సెంటర్‌లో నిర్ణయించిన ధర ప్రకారం ఏజెన్సీ అంతటా గిరిజన రైతులకు చెల్లిస్తారు. వ్యాపారులు ఇక్కడ కొనుగోలు చేసిన జీడి పిక్కలను పలాస, గుజరాత్ తదితర ప్రాంతాలకు తరలిస్తారు. ఎక్కువ మొత్తంలో జీడిపిక్కలు కొనుగోలు చేసి నిల్వ కూడా చేస్తారు. ఈ విధంగా ఏటా రూ.100 కోట్ల వరకు జీడిమామిడి పిక్కల వ్యాపారం సాగుతోంది. పందిరిమామిడి కేంద్రంగా రూ. 60 కోట్లు వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. ఉద్యానవన శాఖ లెక్కల ప్రకారం ఎకరా జీడి తోటలో 250 నుంచి 300 కేజీలు వరకు పంట దిగుబడి వస్తోంది. ఈ ఏడాది ఎకరానికి 200 కేజీల లోపే దిగుబడి రావడంతో రైతులకు పెద్దగా లాభాలు రాలేదు. కౌలుకు తోటలు తీసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. పిక్కలు ఏరేందుకు వచ్చిన డబ్బులు సరిపోయానని వాపోతున్నారు.

కానరాని ఐటీడీఏ కార్యాచరణ..

ఏజెన్సీలో జీడిమామిడి రైతులు ఏటా ముందుగానే వ్యాపారుల నుంచి నగదు తీసుకుంటారు. తోటలు శుభ్రం చేసుకునేందుకు, ఖర్చులు కోసం వాటిని వినియోగిస్తారు. పిక్కలు వచ్చిన తర్వాత వాటిని సదరు వ్యాపారులకు అమ్ముతారు. అప్పుడు ఉన్న మార్కెట్ రేటు కంటే కొద్దిగా తగ్గించి కొనుగోలు చేస్తారు. ఈ ఏడాది ఐటీడీఏ అధికారులు జీడిపిక్కలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కొనుగోలుకు సంబంధించిన ఎటువంటి కార్యాచరణ అమలు కాలేదు. దాంతో గిరిజన రైతులు నష్టపోతున్నారు. ఏజెన్సీలో గతంలో వేసి పిక్క తోటలను రైతులు తొలగించి బీపీటీ రకం జీడి మొక్కలను నాటుకున్నారు. ఇవి తక్కువ కాలంలో కాపునకు రావడంతోపాటు ఎక్కువ దిగుబడి వస్తోంది.

30 వేల జీడిమామిడి అంట్లు అందజేస్తాం

ఏజెన్సీలో జీడిమామిడి పంటను ప్రోత్సహించేందుకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ద్వారా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది 30 వేల జీడిమామిడి అంట్లును గిరిజన రైతులకు అందజేస్తాం. జిల్లాలో రంపచోడవరం ఏజెన్సీలోనే ఎక్కువగా జీడి పంట ఉంది. రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా క్షేత్రస్థాయిలో సాంకేతిక, సహాయ,సహకారాలు అందిస్తున్నాం.

–చిట్టిబాబు, పీహెచ్ఓ, రంపచోడవరం

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రతిభా పాఠశాల (సీవోఈ)లో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి. నాగమణి చెప్పారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతుల్లో ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. 26వ తేదీ ఉదయం 10గంటలు నుంచి సాయంత్రం 4గంటలు వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్ కార్డు, కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్ జత చేస్తూ దరఖాస్తు చేయాలన్నారు. 28వ తేదీ ఉదయం 10గంటలు నుంచి మధ్యాహ్నం 12గంటలు వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. కొమ్మాది జంక్షన్ సమీపంలోని రిక్షా కాలనీలో గల గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాల వెనుక గల బాలికల గురుకుల ప్రతిభా పాఠశాలకు చేరుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94927 85400, 83286 57824లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ నాగమణి కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మహారాణిపేట: జిల్లాలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా వినతులు స్వీకరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరిట ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, అధికారులు స్వయంగా స్వీకరించనున్నారు.

రెవెన్యూ డివిజన్ పరిధిలో..

విశాఖ రెవెన్యూ డివిజన్ పరిధిలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రారంభం కానుందని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు విశాఖ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతుల స్వీకరణ కార్యక్రమం మొదలవుతుందని, అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

పీవీ.. అసాధారణ జ్ఞాని

- పీవీ గ్లోబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రభాకరరావు



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న పీవీ గ్లోబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు పీవీ ప్రభాకరరావు

మహారాణిపేట: సామర్థ్యం, నిజాయతీ, చిత్తశుద్ధి, వినయం, వివేకం, పోరాట పథం..ఇవన్నీ ఒక్కచోట పేర్చితే అదే పీవీ నరసింహారావు. సాహితీ దురంధరుడు, న్యాయశాస్త్ర నిపుణుడు, బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, రాష్ట్రంలో, కేంద్రంలో వివిధ మంత్రిత్వ శాఖలను ఆపోశన పట్టిన అపర భగీరథుడని పీవీ గ్లోబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు పీవీ ప్రభాకరరావు అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమీపంలో అంకోశా ఆడిటోరియంలో భారతరత్న పీ.వీ.నరసింహారావు 104వ జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా పీవీ ప్రభాకరరావు మాట్లాడుతూ పీవీ దేశానికి అందించిన విశిష్ట సేవలను గొప్పగా తలుచుకునే విధంగా, చిరస్మరణీయంగా నిలిచే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పీ.వీ.జ్ఞాపకం రాగనే పదహారణాల తెలుగు వాడు కనపడతాడని, ఆయనతో కూర్చుంటే గ్రంథాలయంలో కూర్చున్నట్టే ఉంటుందన్నారు. విప్లవతత్వం చిన్ననాటి నుంచి ఉందని, పీవీకి.. కాళోజీ నారాయణరావు మంచి మిత్రుడని, ఆ రోజుల్లో వందేమాతరం గీతం నిజాం ప్రభుత్వంలో నిషేధించినా..పీవీ ఆ నిబంధనలను ఉల్లంఘించారన్నారు. చాలా కాలం తరువాత తాను వైజాగ్ వచ్చానని, ఎంతో మంది మేధావులు మనకిచ్చిన నగరం వైజాగ్ అని, విశాఖ అంటే అంటే పీవీకి చాలా ఇష్టమన్నారు. పీవీ విగ్రహం ఇక్కడే మొదటగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. భారతరత్న ఇచ్చిన తరువాత మొదటి కార్యక్రమం ఇక్కడే జరిగిందని, డాక్టర్ రఘురామారావు..పీవీ వీరాభిమాని అని అన్నారు. పీవీ తెచ్చిన సంస్కరణలు నేటి సమాజానికి ఎలా ఉపయోగపడుతున్నాయో పలువురు వక్తలు వివరించారు. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ రఘురామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, ప్రముఖ పాత్రికేయుడు ఎ.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వరద సమీక్షా సమావేశం వాయిదా

చింతూరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన వరద సమీక్షా సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశానికి కలెక్టర్ విజయసునీత హాజరు కావాల్సి ఉండగా ఆమె బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో సమీక్షా సమావేశం వాయిదా పడినట్లు ఐటీడీఏ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా

- మహిళకు గాయాలు

పెదబయలు: మండలంలోని అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామ సమీపంలో ఆదివారం ఓ మహిళకు గాయాలయ్యాయి. పెదబయలు మండలం కప్పడ గ్రామానికి చెందిన తల్లీకొడుకు పాంగి కోనే, సుందర్‌రావు తమ ద్విచక్ర వాహనంపై పాడేరు వెళ్లారు. తిరిగి అక్కడ నుంచి పెదబయలు వస్తుండగా ఎదురుగా అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో బైక్ స్కిడ్ అయ్యి బోల్తాపడింది. బైక్ వెనుక కూర్చొన్న ఆమె ముఖం, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే ఆటోలో పెదబయలు పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న సందర్‌రావుకు ఎలాంటి గాయాలు కాలేదు.

లారీ బోల్తా, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



బోల్తా పడిన లారీ

చింతపల్లి రూరల్: మండలంలో తాజంగి జలాశయం వద్ద ఆదివారం లారీ బోల్తా పడి డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జి. మాడుగుల నుంచి మైదాన ప్రాంతానికి వరికోత మిషన్ తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎన్‌హెచ్ 516ఈ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు తవ్వడం, ఉదయం పడిన వర్షం కారణంగా రహదారి బురదగా మారింది. దీంతో లారీ అదుపుతప్పి బోల్తా పడింది.

నేడు ఇన్‌చార్జి కలెక్టర్‌గా మయూర్ అశోక్ బాధ్యతలు



మహారాణిపేట: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా నియమితులైన జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జునను ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి విధితమే. కాగా ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. సోమవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి ,ఆ తర్వాత ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి మయూర అశోక్ వినతులు స్వీకరిస్తారు.

సాగరతీరంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

బీచ్‌రోడ్డు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక రోజు సందర్భంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ సంయుక్తంగా ఆదివారం సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించింది. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సూపరింటెండెంట్ రాజన్ కుమార్, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో యువత జీవితాలపై చూపిస్తున్న ప్రభావంపై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో 300 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, యువతీ యువకులు పాల్గొన్నారు. లెఫ్టినెంట్ జె.రామారావు, ఫ్లైట్ లెఫ్టినెంట్ డీఆర్ లక్ష్మణ్ రెడ్డి, లెఫ్టినెంట్ సంజయ్ కుమార్, థర్డ్ ఆఫీసర్ గంగరాజు, సతీష్ కుమార్ తదితరుల పాల్గొన్నారు.

పళ్ల వ్యాపారి ఇంట్లో చోరీ



బీరువా విరగ్గొట్టిన దుండగులు



బాధితుల నుండి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు


నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి 28వ వార్డులో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు అందించిన వివరాలివి. వార్డులో నివాసం ఉంటున్న సూరిశెట్టి వెంకటరమణ పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న ఉదయం రమణ కుటుంబ సభ్యులతో కలిసి పండ్ల వ్యాపారానికి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఇది గమనించిన దుండగులు పట్ట పగలు ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం రమణ కుటుంబం ఇంటికి వచ్చి చూడగా, ఇంటి తలుపులు తీసి ఉండి, ఇంట్లోని బీరువాలోని బట్టలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీంతో వారు ఆందోళనతో బీరువాలో చూడగా, అందులోని ఐదు తులాల బంగారం అభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు చోరీకి గురైన ఇంటిని క్లూస్ టీమ్‌తో వెళ్లి పరిశీలించారు. ఇంట్లోని ఆనవాళ్లను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

అనకాపల్లి : అక్రమగా మద్యం తరలిస్తున్న కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన బండారు శ్రీను అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ శంకరరావు చెప్పారు. పట్టణంలో రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బండారు శ్రీను 15 మద్యం క్వార్టర్ బ్యాటిళ్లు తరలిస్తూ పట్టుబడ్డాడని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

హ్యాండ్లింగ్.. వెరీ లేట్.!

- పోర్టులో రోజుల తరబడి నిలిచిపోతున్న షిప్స్
- అస్తవ్యస్తంగా మారిన కార్గో హ్యాండ్లింగ్
- బెర్తులు కేటాయింపులో ట్రాఫిక్ సిబ్బంది నిర్లక్ష్యం
- వ్యవస్థలో లోపాలే కారణమంటూ కుంటిసాకులు
- కొత్త ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ట్రేడర్లు



సాక్షి, విశాఖపట్నం : నెల రోజుల క్రితం వరకూ మేజర్ పోర్టులతో పోటీ పడుతూ దూసుకుపోతున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ).. ఇప్పుడు చతికలపడుతోంది. సరకు హ్యాండ్లింగ్‌లో వరుస రికార్డులు సృష్టించిన పోర్టు.. ఇప్పుడు అదే సరకు రవాణా విషయంలో నీలి సముద్రమంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ట్రాఫిక్ విభాగ వైఖరి కారణంగా కార్గో హ్యాండ్లింగ్ కోసం బెర్తుల కేటాయింపుల్లో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ట్రేడర్లు మొరపెట్టుకుంటున్నా తమకేమీ పట్టనట్లుగా పోర్టు అధికారులు వ్యవహరిస్తుండటంతో హ్యాండ్లింగ్ క్రమంగా కుంటుపడుతోంది.

ఒకే నెలలో అత్యధిక సరకు హ్యాండ్లింగ్.. ఏడాది వ్యవధిలో అత్యధికంగా కోల్ కోక్ దిగుమతి.. భారీగా క్రూడ్ ఆయిల్ నిర్వహణ.. కంటైనర్ల ఎగుమతిలో సరికొత్త రికార్డు.. రెండు మూడు నెలల క్రితం.. పోర్టు ఖాతాలో జమ అయిన రికార్డులివీ. సరకు రవాణా విభాగంలో దేశంలోని మేజర్ పోర్టుల్లో కొన్నింటికి సాధ్యం కాని రికార్డులను సైతం తన ఖాతాలో జమ చేసుకున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ ప్రస్తుతం నెమ్మదిస్తోంది. ట్రాఫిక్ సిబ్బంది నిర్లక్ష్యం అధికారుల అలసత్వం కారణంగా హ్యాండ్లింగ్ చాలా ఆలస్యంగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోర్టుకు చేరుకున్న కార్గో షిప్‌లకు సరైన బెర్తింగ్ ఇవ్వడంలో సంబంధిత విభాగాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వచ్చిన షిప్‌లు బెర్తింగ్ కాకపోవడం సరకు గోదాములకు చేరుకోకపోవడం కొత్త షిప్‌లకు బెర్తులు దొరక్కపోవడంతో పోర్టులో గజిబిజి వాతావరణం నెలకొంది.

కొత్త చిక్కులు తెచ్చిన ట్రక్ పార్కింగ్ టెర్మినల్

ఈ ఏడాది సరకు హ్యాండ్లింగ్ 90 మిలియన్ మెట్రిక్ టన్నులు దాటాలంటూ పోర్టు చైర్మన్ లక్ష్యాన్ని నిర్దేశించినా ఆ పరిస్థితులు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యంగా పోర్టు ఇటీవల రూ.40 కోట్ల వ్యయంతో అందుబాటులోకి తీసుకొచ్చిన ట్రక్‌పార్కింగ్ టెర్మినల్ కారణంగా ట్రేడర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ టెర్మినల్ పోర్టుకు లాభాలు తీసుకొస్తుందే తప్ప.. సరకు రవాణాకు పెద్దగా ఒరిగిందేమీ కనిపించడం లేదు. పోర్టు ఏరియాకు సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఈ ట్రక్ టెర్మినల్ ఉంది. ఒక ట్రక్‌ని పార్కింగ్ చేయాలంటే రోజుకు రూ.150 వరకూ ట్రేడర్లు చెల్లించాల్సి ఉంటుంది. సరకు ఎగుమతి, దిగుమతి చేసుకోడానికి పోర్టుకు ట్రక్ వెళ్లాలంటే.. కచ్చితంగా టెర్మినల్ నుంచే బయల్దేరాలి. అయితే.. బెర్తింగ్ విషయంలో ట్రాఫిక్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల.. రెండు మూడు రోజులు టెర్మినల్‌లో ట్రక్‌లు ఉండాల్సి వస్తోంది. ఫలితంగా.. ఒక్కో ట్రక్‌కు రూ.450 వరకూ చెల్లించడంతో పాటు 16 కిలోమీటర్ల మేర డీజిల్ అదనపు భారంగా మారుతోంది. ఈ కారణంగా.. వచ్చిన లాభాలన్నీ.. పోర్టుకే జమ చేయాల్సి వస్తోందంటూ స్టీవడోర్స్ వాపోతున్నారు. మౌలిక సదుపాయాలపైనా కనీస దృష్టి సారించడం లేదని ఈ వ్యవహారాలను డిప్యూటీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నా ఆయన పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ విభాగంపై చైర్మన్ దృష్టిసారిస్తే తప్ప.. పోర్టు బాగుపడదని విమర్శిస్తున్నారు. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే స్టీవడోర్స్ అంతా పక్కనే ఉన్న గంగవరం పోర్టు వైపు అడుగులు వేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



రెండు మూడు రోజులైనా..

ఇటీవల కాలంలో రెండు మూడు రోజులైనా సరకుతో వచ్చిన షిప్‌లకు బెర్తులు ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. షిప్ వచ్చిందని హ్యాండ్లింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ట్రేడర్లు అడిగే వరకూ ట్రాఫిక్ విభాగాధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇటీవల గుజరాత్ నుంచి వచ్చిన ఓ అధికారి ఈ వ్యవహారాలను పూర్తిగా విస్మరించేశారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టీవడోర్లకు అందుబాటులోకి రావడం లేదని ఆయన లేకపోవడంతో దిగువ స్థాయి సిబ్బందికి అడుగుతున్నా సరైన స్పందన రావడం లేదంటూ వాపోతున్నారు. ఫలితంగా తీవ్ర నష్టాల్ని చవిచూస్తున్నామంటూ స్టీవడోర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్రాఫిక్ విభాగంలో ఈ తరహా ఇబ్బందులు ఎప్పుడూ ఎదుర్కోలేదని స్టీవడోర్స్ చెబుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం కూడా పోర్టు విస్మరించడం విస్మయానికి గురి చేస్తోందని ఆరోపిస్తున్నారు.